## చంద్రలోక యాత్ర

### కలువకొలను సదానంద

చందమామ పొందుగోరి
చేతులెత్తి చిన్నిపాప -
"చందమామ! చందమామ!
అందమైన చందమామ!
అందవేల? అందుకోవ..."
అనుచు పిలిచె అదేపనిగ.

చిన్ని చేయి చాచి పిలుచు
చిన్ని పాప జాలిపిలుపు
విన్న చందమామ-భువికి
చిన్నగ దిగి, చేరవచ్చె;
అమ్మ చంకనున్న పాప
నెత్తుక పైకెగిరి పోయె.

పూల పరుపు వోలెనున్న
చల్లనయ్య ఒడియందున
వెన్నవంటి వెన్నెలతో
వెక్కిరించు చుక్కలతో
చిన్నిపాప ఒళ్ళు మరచి,
చాలసేపు ఆటలాడె.

ఆటలాడి అలసిపోయి,
అమ్మదరికి పోవాలని
పట్టుబట్టి పాప ఏడ్వ
చుట్టునున్న చుక్కలన్ని
పాపను మరపించాలని
విఫల ప్రయత్నములు చేసె.

చేతకాని చందమామ
చిన్నిపాప నెత్తుకెళ్ళి,
అమ్మ చేతులందుంచిన—
అమ్మ ఒడిని దూరి, పాప
కాలు చేతు లాడించుచు
కిలకిలమని నవ్వసాగె.

మరల-నింగివైపు చూచి,
పిలువసాగె జాబిల్లి ని:
'చందమామ! చందమామ!
అందమైన చందమామ!...'
చల్లనైన చందమామ
తెల్లమబ్బులందు దాగె!.

# రామన్న సాహసం

అనగా అనగా ఒక గ్రామంలో ఒక చాకలి ఉండేవాడు, అతడు చాలా పేదవాడు. పేరు రామన్న. రామన్న భార్య సీతమ్మ. వారికి ఒక గాడిద ఉండేది. ఆ దంపతులు ఊరిబయట ఒక గుడిసె వేసుకొని దానిలో నివసించేవారు.

ఇలా ఉండగా రామన్న గాడిద ముసలిది అయిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం దానిని మేతకు విడిచేవారు. ఒకరోజు రాత్రి అది ఇంటికి తిరిగిరాలేదు. ఆ గాడిద తప్ప వేరే ఆధారం లేదు రామన్నకు. దానిని వెతుక్కుంటూ చాలాదూరం తిరిగాడు. అసలే అలసిఉన్నాడేమో కోపం ముంచుకు వచ్చింది.

అర్ధరాత్రివేళ ఎక్కడో ఒక చోట ఆగాడిద మెడ వ్రేలాడవేసి నిలబడిఉండడం చీకట్లో లీలగా కనుపించింది రామన్నకు. బడితెతో దానిని చావమోది, ఈడ్చుకొని వచ్చి, పెరటిలో వేపచెట్టుకు కట్టి నిద్రపోయాడు రామన్న.

బళ్ళున తెల్లవారింది. అంట్లు తోమడానికి పెరటిలోకి వెళ్ళిన సీతమ్మ ఒక్క గంతున గుడిసెలో పడి తడికె గట్టిగా చేరవేసి వణక సాగింది. రామన్నకూడా లేచి పెరటిలోకి చూచి గతుక్కుమన్నాడు. ఏమంటే పెరటిలో వేపచెట్టుకు కట్టబడిఉన్నది రామన్న ముసలిగాడిద కాదు. ముప్పన్నె మెకం!

రామన్న అదృష్టం బాగుంది. కొలది సేపటిలోనే రాజుగారి సైనికులు ఆదారిని వచ్చారు. రామన్న పెరడులోఉన్న పులిని చూచినారు. ఈటెలతో పొడిచి చంపేశారు.

రామన్న తెలివిఅయినవాడు. అంతవరకు వణుకుతూఉన్నవాడు పులి గిలగిల తన్నుకొని చావగానే, తడికె తీసుకొని బయటికి వచ్చాడు. సిపాయిలను నిలబెట్టాడు.

"అది నా పెంపుడు పులి. నాకు గాడిదలా చాకిరీ చేస్తుంది. నిష్కారణంగా దానిని చంపి నాకు జీవనాధారం లేకుండా చేశారు. రాజుగారితో చెప్పి మీ తలలు తీయిస్తా"నని బెదిరించాడు.

పెద్ద పులిని గాడిద చేసినవాడు ఎంతటి సాహసికుడు, బలవంతుడు అయి ఉంటాడో తలుచుకొని వణికి పోయినారు సైనికులు. తమ వద్ద ఉన్న కానులు అన్నీ రామన్నకు సమర్పించి తప్పు మన్నించమని ప్రాధేయపడినారు. చివరికి వారిని కరుణించాడు రామన్న.

ఆ కానులు విక్రయించగా లభించిన ద్రవ్యంతో పెద్ద భవంతి నిర్మించాడు రామన్న. పులి చర్మం వీధి గుమ్మానికి కట్టించి తన సాహసం ప్రపంచానికి చాటినాడు.

రామన్న సాహసగాథ ఆనోటా ఆనోటా ప్రాకి చివరికి రాజుగారి చెవిని పడినది. అంతటి మహా సాహసవంతుడు తన రాజ్యంలో ఉన్నందుకు రాజు చాలా ఆనం